# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 306 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 3 జులై 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# ఏపీ నుంచి అమలులోకి వీబీ జీ రామ్ జీ పథకం

**రైల్వేకోడూరు నుంచి పథకం ప్రారంభించిన కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం**

**వీబీజీ రామ్ జీ తో రాష్ట్రాలకు రూ.7.5 లక్షల కోట్ల కేంద్ర నిధులు**

**ప్రతీ గ్రామ పంచాయితీకి ఏడాదికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు**



**తిరుపతి, జూలై 2 (నమస్తే ఉదయం)**

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం వీబీ జీ రామ్ జీ ఏపీ నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రక ఘట్టానికి తిరుపతి జిల్లా రైల్వేకోడూరు వేదికైంది. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' పథకాన్ని ఏపీ నుంచి ప్రారంభించారు. దీంతో దేశవ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి వచ్చింది. ముక్కవారిపల్లి గ్రామంలో రూ.4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనుల్ని ముగ్గురు నేతలూ లాంఛనంగా ప్రారంభించారు. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను వీబీ జీ రామ్ జీ మిషన్ కింద తొలుత చేపట్టారు. ఈ పథకం కింద స్థానిక లబ్దిదారులకు కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎంలు కలిసి వీబీజీ రామ్ జీ జాబ్ కార్డులను అందజేశారు. కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ లు వీబీ జీ రామ్ జీ ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించారు. ఈ పథకం కింద సమాచార బుక్ లెట్, కంపెండియం ఆఫ్ ఆర్టికల్స్ ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విడుదల చేశారు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఆజివికా మిషన్ పోర్టల్ ను నేతలు ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..” వీబీ జి రామ్ జీ పథకం ఏపీలోని రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావటం చారిత్రాత్మకం. గతంలో నరేగా రాయలసీమ ప్రాంతం నుంచే ప్రారంభమైంది. ఇప్పుడు కూడా వీబీజీ రామ్ జీ పథకం ఇక్కడి నుంచే ఆవిష్కృతం అయ్యింది. కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు, రాష్ట్రం మరో రూ.4 వేల కోట్ల వ్యయంతో వీబీజీ రామ్ జీ కింద పనులు చేపడతాం. రూ.11 వేల కోట్ల పైచిలుకు మొత్తంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ..మిగతా 2లో

# విధిలేక వీబీ జీరాంజీ అమలు

**గత్యంతరంలేని పరిస్థితుల్లోనే ఆ నిర్ణయం.. అయినా దీనిపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం**

**టీచర్లకూ మధ్యాహ్న భోజనం.. భోజన నాణ్యత, పర్యవేక్షణ పెంచడమే లక్ష్యం**

**తెలంగాణ ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం**



**మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు ఆమోదం**

**రూ.7,345కోట్లతో మొదటి దశ పనులకు గ్రీన్ సిగ్నల్**

**వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేస్తూనే కోర్టులో సవాల్**

**సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మొత్తం 6,278 పోస్టుల మంజూరు**

**తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు**

**హైదరాబాద్, జులై 2 (నమస్తే ఉదయం)**

తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.7,345కోట్లతో మొదటి దశ పనులు చేపట్టనున్నారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీనికి సంబంధించిన అభ్యంతరాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయం తీసుకుంది.కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి , సీతక్కలు వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా తొలగించారని మండిపడ్డారు. దీని స్థానంలో వివిజిరామ్ పథకం తేవడం దుర్మార్గమని అన్నారు. విధిలేని పరిస్థితిలో దీనిని ఆమోదిస్తూనే, దీనిపై న్యాయపోరాటం చేయాలని కేబినేట్ నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిన 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ కొత్త చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఇది ఫెడరల్ , రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫారసులపై చర్చించారు. ఉపాధి ..మిగతా 2లో



# కాంగ్రెస్, బిఆర్ఎస్ సవాళ్ల పర్వం

**తెలంగాణ భవన్ వద్ద హరీష్ తదితరుల అరెస్ట్**

**గన్‌పార్క్ వద్ద చర్చకు సిద్ధం అంటూ మంత్రుల బైఠాయింపు**

**హైదరాబాద్, జులై 2 (నమస్తే ఉదయం)**

రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లతో పాలిటిక్స్ హీటెక్కాయి. కాంగ్రెస్ పార్టీ రెండున్నరేండ్ల చెత్త పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. అవినీతి, అక్రమాలపై లెక్కలతో పక్కాగా వివరిస్తాననిస్పష్టం చేశారు. డేట్ అండ్ టైం ప్లేస్ ఏదైనా సరే.. 'వరంగల్ ప్రెస్‌క్లబ్‌లోనా? అశోక్‌నగర్‌లోనా? అసెంబ్లీలోనా? వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరపున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనా వైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని చాలెంజ్ చేశారు. కాగా, కేటీఆర్ సవాల్‌కు ..మిగతా 2లో

## గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

**ఎన్నికైన ప్రజాప్రతినిధులతోనే చర్చిస్తాం**

**కెసిఆర్ లాగా కడప కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వలేదు**

**బిఆర్ఎస్ విమర్శలపై మంత్రి పొన్నం ప్రతి విమర్శలు**



**హైదరాబాద్,జూలై2 (నమస్తే ఉదయం)**

గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సవాల్‌తో మంత్రులు గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం మీడియాతో ..మిగతా 2లో

## కల్వకుంట్ల కవిత అరెస్ట్

**హైదరాబాద్, జులై 2 (నమస్తే ఉదయం)**

తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ శివారులోని బోడుప్పల్‌లో గురువారం ఆమె నిరసన కార్యక్రమం నిర్వహిస్తుండగా ఈ పరిణామం ..మిగతా 2లో





## తిరుచ్చి ఉప ఎన్నికపై వీడని ఉత్కంఠ

**పోటీ నుంచి తప్పకున్న లారెన్స్**

**నటి త్రిష పోటీ చేస్తారంటూ ప్రచారం**

**చెన్నై,జూలై2 (నమస్తే ఉదయం)**

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ త్రిష పేరు మరోసారి తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆమె త్వరలో రాజకీయాల్లోకి అడుగుపెడతారని ప్రచారం సాగుతోంది. తిరుచ్చి ..మిగతా 2లో

## క్వారీలో కార్మికులపై దొర్లిపడ్డ బండరాయి

**కర్ణాటకలో ఘోర ప్రమాదం**

**ఏడుగురు కార్మికుల దుర్మరణం**

**ఘటనపై సిఎం శివకుమార్ దిగ్భ్రాంతి**



**బెంగళూరు,జూలై2 (నమస్తే ఉదయం)**

కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు దక్షిణ తాలూకాలోని మడ పట్టణంలో గురువారం భారీ బండరాయి కార్మికులపై పడటంతో ఏడుగురు కార్మికులు మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఓ స్టోన్ క్రషర్ కంపెనీలో కూలీలు పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను బిహార్‌కు ..మిగతా 2లో

# ఏపీ నుంచి అమలులోకి వీబీ జీ రామ్ జీ పథకం

మొదటి పేజీ తరువాయి...

సారథ్యంలో ఈ పథకం కింద గ్రామాల రూపు రేఖలు మారతాయి. 125 రోజుల పని దినాలతో గ్రామీణ అభివృద్ధికి కావాల్సిన ఏ పనైనా చేపట్టేందుకు వీబీజీ రామ్ జీ కింద అవకాశం కల్పిస్తోంది. రహదారులు, డ్రైనేజీలు, కాలువలు ఇలా వేర్వేరు ఆస్తుల కల్పనకు ఆస్కారం ఉండేలా ఈ పథకం వినియోగిస్తాం. జియో ట్యాగింగ్, బయోమెట్రిక్ లాంటి సాంకేతికతతో పూర్తి పారదర్శకంగా ఈ పథకం నిర్వహిస్తాం. గాలేరు నగరి నుంచి కోడూరుకు నీళ్లు తీసుకువస్తాం, జలధార ద్వారా భూగర్భ జలాలను కూడా పెంచుతాం. రాష్ట్రాలు వ్యయం చేసేలా ఈ పథకం చేపట్టటం భారం కాదు బాధ్యత. 13,226 గ్రామాల్లో ఒకే మారు గ్రామసభలు పెట్టి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కే దక్కింది. 7,000 కి.మీ. మేర సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటి తొట్టెలు, 1.07 లక్షల ఫార్మ్ పాండ్లు, 1,373 కి.మీ మేర గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల సాగు జరిగింది. ఉపాధి హామీ పనుల నిమిత్తం 55.44 కోట్ల పని దినాలు కల్పించి, రూ.16,695 కోట్లు ఖర్చు చేశాని. ఈ ఏడాది 10 వేల కి.మీ. గ్రావెల్ రోడ్లు, 1,500 కి.మీ. సిమెంట్, బీటీ రోడ్లు, 500 కి.మీ. మేజిక్ డ్రైన్లు, లక్ష ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యంగా పొలాలకు వెళ్లే డొంక రోడ్లు కూడా జీ రామ్ జీ పథకం కింద నిర్మించవచ్చు". అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జల్ జీవన్ మిషన్ సహా 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను గత పాలకులు నిర్వీర్యం చేస్తే వాటిని తిరిగి పునరుద్ధరించామని సీఎం అన్నారు. రూ.28 వేల కోట్లతో వివిధ పథకాలు చేపడుతున్నామని.. విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెడతామని చెప్పి రెండేళ్లలో మాట నిలుపుకున్నామని వివరించారు. సీఎం మాట్లాడుతూ "కేంద్రం అమరావతికి సహకారం అందించింది. వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. గొడ్డలి పార్టీ రోజుకో మాట మాట్లాడుతోంది. ఎన్నికల ముందు ఓ మాట ఎన్నికలు అయ్యాక మరో మాట మాట్లాడారు. ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పాట పాడుతున్నారు. ఇది ఎవరికైనా అర్థం అయ్యిందా. అమరావతిని ఆపటం ఎవరి తరమూ కాదు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిలబెట్టటంతో పాటు రైల్వే జోన్ సాధించాం. గూగుల్ డేటా సెంటర్ తో పాటు పుట్టపర్తిలో ఆమ్కా ఫైటర్ జెట్ తయారీ యూనిట్ వస్తోంది. రాయలసీమను అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలుపుతాం. దేశంలోనే ఉద్యాన పంటలకు కేంద్రం రాయలసీమ. త్వరలోనే రూ.40 వేల కోట్లతో ప్రభుత్వం, రూ.60 వేల కోట్ల ప్రైవేటు ప్రైవేటు పెట్టుబడులు తెస్తాం. మదనపల్లిలో హార్టీకల్చర్ హబ్ కు త్వరలోనే శంకుస్థాపన చేస్తాం. సత్యవేడులో హీరో మోటార్స్ సైకిళ్ల తయారీ యూనిట్ ఉంది. తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ ప్లాంట్ వస్తోంది. ప్రజల మనిషి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అడిగిన వెంటనే సమస్యల్ని పరిష్కరించారు. తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు, రహదారులు, పీఎంఏవై కోసం నిధులు ఇచ్చారు. దీనికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈ వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా ఏపీని తయారు చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బంగారం గనులు ఉన్న జొన్నగిరి పేరును చారిత్రక పేరు స్వర్ణ గిరిగా మార్చాం. నిస్వార్థంగా పనిచేసే కూటమి నేతలకు ప్రజలు సహకరించాలని కోరుతున్నాను. భారత మాతకు వికసిత్ భారత్ – తెలుగు తల్లికి స్వర్ణాంధ్ర సంకల్పం చేశాం. స్వర్ణాంధ్ర ప్రదేశ్ అన్ స్టాపబుల్. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ సవాళ్ల పర్వం

మొదటి పేజీ తరువాయి...

మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు గురువారం 11 గంటలకు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరిచిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. ఇదిలావుంటే గురుకులాల్లో టెండర్లలో అవినీతి ఆరోపణలపై చర్చల్లో ట్విస్టు చోటు చేసుకుంది. కేటీఆర్, హరీశ్ రావు గన్‌పార్క్‌కు రావాలని మంత్రులు సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో గురుకులాల్లో అవినీతిపై చర్చకు హరీశ్ రావు సిద్ధమయ్యారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి గన్‌పార్క్ బయలు దేరారు. గురుకులాలపై చర్చకు మేము ప్రెస్‌క్లబ్ రమ్మంటే మంత్రులు గన్‌పార్క్ రమ్మన్నారు. మాకు ఎలాంటి భేషజాలు లేవు. మీరు రమ్మన్నారు మేము వస్తున్నామని తెలిపారు. చర్చకు ఎక్కడికైనా మేము సిద్ధమని పేర్కొన్నారు. ఎలాంటి గొడవలు వద్దు కూర్చొని మాట్లాడుకుందామన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే వారికి టెండర్లు ఇచ్చారని ఆరోపించారు. ఒకవేళ మంత్రి జూపల్లి తెలంగాణ భవన్‌కు వెళ్తే..కేటీఆర్ చర్చించేందుకు రెడీగా ఉన్నారని పేర్కొన్నారు.కాగా, గన్‌పార్క్‌కు బయలు దేరిన హరీశ్ రావును పోలీసులు అడ్డుకోవడంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ముగ్గురు మంత్రులు రమ్మంటేనే మేము వెళ్తున్నాం. ఎందుకు ఆపుతున్నారని పోలీసులను ప్రశ్నించారు. కావాలంటే మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫోన్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని చర్చలను అడ్డుకుంటుందని హరీశ్ రావు మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కారు దిగి పాదయాత్రగా వెళ్లేందుకు హరీశ్ రావు యత్నించారు. ఈ క్రమంలో అక్కడ జరిగిన తోపులాటలో ఆయన కిందపడిపోయారు. ఆ వెంటనే మాజీ మంత్రిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరీశ్‌తో పాటు మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేశారు. దీంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం పారిపోయిందంటూ దుయ్యబట్టారు. అవినీతి జరిగింది కాబట్టే భయపడుతున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా గన్‌పార్క్‌కు ముగ్గురు మంత్రులూ చేరుకుని.. అమరవీరుల స్థూపం దగ్గర కూర్చున్నారు. మంత్రులకు మద్దతుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గన్‌పార్క్‌కు వచ్చారు. తెలంగాణ మంత్రులు, మాజీ మంత్రుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో గన్‌పార్క్ దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. అటు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్, తెలంగాణ భవన్ దగ్గర కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దేవాలయం లాంటి అసెంబ్లీలో హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు. తాము ప్రెస్‌క్లబ్‌కు కూడా వస్తామని.. కానీ రాజ్యాంగంలో ఎన్నికైన వ్యక్తులు చర్చకు రావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈరోజు 12 గంటల్లోగా గన్‌పార్క్ దగ్గరకు రావాలని అన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని తేల్చిచెప్పారు. తాము పారదర్శకంగా గురుకులాల టెండర్లు జరగాలని చూశామని పేర్కొన్నారు. 'గురుకులాల టెండర్ కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్ మాకేమైనా చుట్టమా?. టెండర్లలో అసలు అవినీతి జరిగింది రూ.2 వేల కోట్లా..? రూ.5వేల కోట్లా..?. బీఆర్ఎస్ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. ఆధారాలతో రండి మేము చర్చకు సిద్ధం. మేము అవినీతి చేసినట్లు నిరూపిస్తే.. ముగ్గురు మంత్రులం గన్‌పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాం. మేము పిరికివాళ్లం కాదు. ఎవరితో పడితే వారితో చర్చకు రాము. మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలి. లేదంటే కేసీఆర్‌కు చెడ్డపేరు వస్తుంది. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. ఆయన అవినీతి చేసి ఉండొచ్చు.. ఆర్ఎస్పీకి మేం సమాధానం చెప్పం. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బంది పడొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# తిరుచ్చి ఉప ఎన్నికపై వీడని ఉత్కంఠ

మొదటి పేజీ తరువాయి...

ఉపఎన్నికలో అధికార పార్టీ తరఫున బరిలో నిలుస్తారా? అనే చర్చలు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ ప్రచారానికి ప్రధాన కారణం హీరో, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ తీసుకున్న నిర్ణయమే. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి రెండింట్లోనూ విజయం సాధించారు. అనంతరం తిరుచ్చి స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. మొదట ఈ స్థానంలో రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని విస్తృతంగా ప్రచారం జరిగింది. ఆయన కూడా రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి చూపినట్లు వార్తలు వచ్చాయి. అయితే చివరి నిమిషంలో ఆయన పోటీ నుంచి తప్పుకోవడంతో ఇప్పుడు తిరుచ్చి అభ్యర్థి ఎవరనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో త్రిష పేరు తెరపైకి వచ్చింది. విజయ్‌కు సన్నిహితురాలిగా పేరున్న త్రిషను రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఆలోచన ఉందా? ఆమె ఉపఎన్నికలో పోటీ చేసే అవకాశం ఉందా? అనే ఊహాగానాలు తమిళ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు త్రిష గానీ, ముఖ్యమంత్రి విజయ్ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం అంతా ఊహాగానాలకే పరిమితమైంది. అయినప్పటికీ త్రిష రాజకీయ అరంగేట్రంపై తమిళనాట ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. అధికారిక ప్రకటన వస్తేనే ఈ వార్తలకు పూర్తి స్పష్టత రానుంది. ఇక సినిమాల విషయానికి వస్తే త్రిష ప్రస్తుతం సినిమాలతోను బిజీగా ఉంది. ఇటీవల కరుప్పు చిత్రంతో పెద్ద హిట్ కొట్టిన త్రిష ఇప్పుడు చిరంజీవి విశ్వంభర సినిమాతో సందడి చేసేందుకు సిద్ధమైంది. మరోవైపు పలు చిత్రాలకి సైన్ చేసింది. ఈ వయస్సులోను త్రిష వరుస అవకాశాలు అందిపుచ్చుకోవడం , అలానే మంచి హిట్స్ దక్కించుకోవడం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.



# క్వారీలో కార్మికులపై దొర్లిపడ్డ బండరాయి

మొదటి పేజీ తరువాయి...

చెందిన వలస కూలీలుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో సుమారు 15 నుంచి 20 మంది కార్మికులు ఉన్నారని వారు తెలిపారు. కొత్త క్రషర్ యూనిట్ ఏర్పాటు కోసం దాదాపు 100 అడుగుల ఎత్తులో ఒక హిటాచీ యంత్రం పని చేస్తోందని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఒక పెద్ద బండరాయి జారి కింద ఉన్న కార్మికులపై పడిందని పోలీసులు వివరించారు. దీంతో ఏడుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. శిథిలాలను తొలగించి చిక్కుకుపోయిన కార్మికులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. మరోవైపు బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. క్వారీలో నిర్లక్ష్యం లేదా భద్రతా నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదంపై కర్ణాటక సీఎం శివకుమార్ స్పందిస్తూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తి లభించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల భద్రత, రక్షణ అనేది క్వారీ యజమానుల బాధ్యత అని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు తేలిన క్వారీలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని సీఎం శివకుమార్ హెచ్చరించారు.



# కల్వకుంట్ల కవిత అరెస్ట్

మొదటి పేజీ తరువాయి...

చోటుచేసుకుంది. కవితతో పాటు పలువురు తెలంగాణ జాగృతి నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడం లేదని కవిత ఆరోపించారు. ఉప్పల్ భగాయత్ వంటి ప్రాంతాల్లో ఉద్యమకారులకు భూములు కేటాయించడంలో ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆమె విమర్శించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆమె ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఆందోళన సందర్భంగా పోలీసులు, నిరసనకారుల మధ్య స్వల్ప వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. అనంతరం కవితను, ఇతర నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ అరెస్టుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# అమీన్‌పూర్‌లో 34.5 కలోల గంజాయి పట్టివేత

**ఒడిశా నుంచి వాహనంలో తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్, ఒకరు పరారి**

**పటాన్ చెరు, జూలై 2 (నమస్తే ఉదయం):**

అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్ద మొత్తంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 34.5 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితుల్లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, 34.50 కిలోల ఎండిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఒడిశా రాష్ట్రంలోని మల్కంగిరి జిల్లా నుంచి బొలెరో వాహనంలో గంజాయిని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ప్రత్యేక నిఘా బృందం, అమీన్‌పూర్ పోలీసులు సంయుక్తంగా సుల్తాన్‌పూర్ ఔటర్ రింగ్ రోడ్డు వలయం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, ప్రత్యేక అరల్లో దాచిపెట్టిన 17 ప్యాకెట్లలో ఉన్న 34.5 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. దీని విలువ సుమారు 17 లక్షల రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు.ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, గంజాయితో పాటు బొలెరో వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి సరఫరా చేస్తున్నట్లు నిందితులు అంగీకరించినట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపారు.ఈ ఘటనపై మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని అమీన్‌పూర్ పోలీసులు సూచించారు.

# విద్యార్థులకు 'నీళ్ల చారు'తోనే అన్నం!



**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 2 (నమస్తే ఉదయం)**

కేటిదొడ్డి మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాల్సింది పోయి, పప్పు, కూరగాయలు లేకుండా కేవలం పల్చటి "నీళ్ల చారు"తోనే భోజనం వడ్డించారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఏజెన్సీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని తల్లిదండ్రుల ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించడంలో పూర్తిగా విఫలమయ్యారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నిధుల కొరత సాకుతోనో, లేదా ఏజెన్సీల నిర్లక్ష్యం వల్లో విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెడు దొడ్డి ఎంఈఓ విజయభాస్కర్ వివరణ కొరగ పాఠశాలలో నాణ్యతలేని భోజనం వడ్డిస్తే ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు మద్యాహ్న భోజనంలో నీళ్లచారు అన్నం వండించినట్లు తమ దృష్టికి రాలేదన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకే జిల్లా మహాసభ !

### భారీ ఎత్తున నిర్వహణకు కమిటీల ఏర్పాటు

**పటాన్ చెరు (సంగారెడ్డి) జూలై 2 (నమస్తే ఉదయం):**



జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా మహాసభను ఈనెల 9వ తేదీన భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి , జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ తెలిపారు. మహాసభ ఏర్పాట్లకు సంబంధించి గురువారం సంగారెడ్డి లోని టీఎన్జీవో భవన్ లో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఫైసల్ మాట్లాడుతూ జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నామని అన్నారు. చాలామంది అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇంకా రాలేదని, హెల్త్ కార్డు సమస్య ఇంకా పెండింగ్ లోనే ఉందని చెప్పారు. అదే సమయంలో ఉద్యోగ భద్రత కూడా లేకుండా పోయిందని అన్నారు. వీటన్నిటిపై చర్చించడానికి గాను 9వ తేదీన సంగారెడ్డిలో మహాసభ జరుపుతున్నామని వివరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు పాత్రికేయులకు పదివేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నామని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జిల్లాలోని పాత్రికేయుల సమస్యల పరిష్కారమే తమ యూనియన్ లక్ష్యం అని వెల్లడించారు. అంతేకాకుండా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న మధ్య తరహా పత్రికలు, ఉర్దూ పత్రికలు,కేబుల్ టీవీ, ఫోటోగ్రాఫర్లు ,వీడియో గ్రాఫర్లు దశాబ్దాలుగా ఈ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారని అన్నారు. వారందరికీ ఈ మహాసభ ద్వారా భరోసా కల్పించనున్నట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ ఇంటి స్థలం, హెల్త్ కార్డు, అక్రిడేషన్ కార్డులను సాధించడం జరుగుతుందన్నారు. మహాసభ నిర్వహణకు ఆహ్వాన కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీ, ఫుడ్ కమిటీ, వేదిక అలంకరణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణతో పాటు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇతర ముఖ్యులు మహాసభకు హాజరవుతున్నందున అన్ని మండలాల నుంచి నియోజకవర్గ కేంద్రాల నుంచి పెద్ద ఎత్తున పాత్రికేయులు తరలి కావాలని కోరారు. ఈ మేరకు ఆయా ప్రాంతాలలో సమన్వయం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ నాడు ఉమ్మడి రాష్ట్రంలో నేడు తెలంగాణలో జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం గళమెత్తుతున్న సంఘం తనదేనని అన్నారు. అన్ని విభాగాల జర్నలిస్టుల ఐక్యతకు పాటుపడుతూ, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా మహాసభ పోస్టర్ ను విడుదల చేశారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు అనిల్ ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధిక్, జిల్లా కోశాధికారి మసూద్, ఇతర ముఖ్యులు సిద్దన్న పాటిల్, శ్రీనాథ్ ,బసవరాజ్ , హాజీ, వెంకటరెడ్డి, మల్లేశం, శివకుమార్,బాసిత్ ,అన్వర్, మతీన్,విల్సన్, ఈశ్వర్ చవాన్, లక్ష్మణ్,సంగమేశ్వర్ , ప్రభాకర్, నజీర్,అంజయ్య, రమేష్ గౌడ్ ,వెంకటేష్, రవీందర్, పరంజ్యోతి, సత్తార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లకు ఎస్ఐఆర్ పత్రాలు అందజేస్తున్న వనిత రెడ్డి

## ఓటర్లకు ఎస్ఐఆర్ పత్రాలు పంపిణి చేసిన బిజెపి మహిళా మోర్చా నాయకురాలు వనితారెడ్డి

**రాజేంద్రనగర్, జూలై 2 (నమస్తే ఉదయం)**

జిహెచ్ఎంసి అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ డివిజన్ లో క్షేత్ర అపార్ట్మెంట్లో బిజెపి మహిళా మోర్చా నాయకురాలు మేకలవనిత రెడ్డి ఓటర్లకు ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వనితారెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమం తో నిజమైన ఓటర్లకు న్యాయం చేకూర్తుందన్నారు.

## హుక్కా సేవిస్తున్న ఇద్దరు అరెస్ట్

**బుద్వేల్, జూలై 2 (నమస్తే ఉదయం)**

ఆరాంఘర్ లో నూతనంగా ఏర్పాటు చేయబోయే హుక్కా సెం టర్ లో హుక్కా త్రాగుతున్న యజమాని సలీం తో పాటు అతని స్నేహితుణ్ణి గురువారం సాయంత్రం మైలార్దేవుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు హుక్కా పాట్స్ తో పాటు మూడు ఫ్లేవర్స్ ను స్వాధీనం చేసుకున్నారు. త్వరలో ప్రారంభించనున్న బ్లాక్ ఫాంథర్ హుక్కా సేంటర్ లో యజమాని సలీం తన స్నేహితునితో కలసి హుక్కా సేవిస్తుండగా కేసు నమోదు చేయడం జరిగిందని మైలార్దేవుపల్లి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

## ఎస్ఐఆర్ దరఖాస్తులను బిఎల్ఓలు పూర్తి చేసి ఇవ్వాలి

**కొత్తకోట, జూలై 2 (నమస్తే ఉదయం)**




తహసిల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న బి.ఆర్.ఎస్ నాయకులు

కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎస్ ఐ ఆర్ నమోదు పత్రం బిఎల్వోలు పూర్తిచేసి ఇవ్వాలని బి ఆర్ ఎస్ నాయకులు మండల తాసిల్దార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్ ఐ ఆర్ ఎన్యుమరేషన్ లో పొందుపరిచిన పలు అంశాలు ప్రజలకు పూరించటానికి ఇబ్బందికరంగా ఉన్నాయని బిఎల్వోల చేత వివరాలు పూర్తి చేయించి సమర్పించే విధంగా చూడాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వనపర్తి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గుంద్రాతి వామన్ గౌడ్, మాజీ సి డి సి చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా డీఎం హెచ్ ఓ డాక్టర్ స్వర్ణ కుమారి

## వర్షా కాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వర్ణ కుమారి

**బుద్వేల్, జూలై 2 (నమస్తే ఉదయం)**

వర్షాల కారణంగా నిలువ ఉండే నీరు, నీటి కాలుష్యంతో పెరిగే దోమల బాక్టీరియా, వైరస్ లతో విజృంభించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ స్వర్ణకుమారి జిల్లాలోని వైద్యాధికారులకు సూచించారు. వర్షాకాలంలో విజృంభించే ప్రమాదకర వ్యాధులపై వైద్యాధికారులతో గురువారం శివరాంపల్లి లోని వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ, నిలువ నీటిలో పెరిగే దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్, వివిధ వర్షాకాల వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకోసం ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఆరోగ్య కార్యకర్తల చే దోమల నివారణ చర్యలను వివరించాలన్నారు. మరిగించి శు ద్ధి చేసిన నీటి ని త్రాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జ్వరం, విరేచనాలు, వాంతులు కనిపిం చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించాలన్నారు. దాని ద్వారా సమస్యను తీవ్రమయ్యే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చన్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న మహిళలను క్రమం తప్పకుండ పర్యవేక్షిం చాలన్నారు. గర్భిణీ స్త్రీలకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. జూలై 13వ తేదీన నిర్వహించే జీతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఒకటి నుంచి 19 సం వత్సరాలు గల పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాల లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రం గారెడ్డి జిల్లా అడిషనల్ డీఎం హెచ్ ఓ డాక్టర్ పాపారావు, ఉన్నతాధికారులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, శిబా హయత్, డాక్టర్ రాధిక, డాక్టర్ రాజేశ్, ఆక్రమ్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న వైద్యులు



రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కి వినతి పత్రం అందచేస్తున్న బీజేపీ నాయకులు వై శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి తదితరులు

## బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లు చేయాలి: బీజేపీ

**రాజేంద్ర నగర్, బుద్వేల్, జూలై 2 (నమస్తే ఉదయం)**

ఆషాఢ మాసంలో ప్రతి ఏడాది జరుపు కునే బోనాల ఉత్సవాలకు ఆలయాల వద్ద ఏర్పాట్లు చేయాలని బీజేపీ నేతలు కోరారు.భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో త్వరలో ప్రారంభం కానున్న పవిత్ర ఆషాఢ మాస తెలంగాణ బోనాల పండుగను పురస్కరించుకుని, వివిధ పోచమ్మ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేసారు. వీలైనంత త్వరగా దేవాలయాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆలయాల పరిసరాల్లో వెంటనే సిసి రోడ్ల మరమ్మతులు చేపట్టాలి.డ్రైనేజ్ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలి. భక్తుల కోసం తాగునీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకునేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు.వినతి పత్రం సమర్పించిన వారిలో: వై. శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, పవన్, రాజశేఖర్ రెడ్డి, సదానందం, పి రవీందర్,యాదగిరి,రవి,వేణు, కిరణ్, ఇతర బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.




ప్రేమావతి పేట్ ప్రాథమిక పాఠశాలకు కార్పెట్ లు బహుకరిస్తున్న ఐ ఐ ఓ ఆర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్

## పేద విద్యార్థులకు చేయూత

**బుద్వేల్, జూలై 2 (నమస్తే ఉదయం)**

పే బ్యాక్ టు సోసైటీ అనే నినాధంతో రాజేంద్రనగర్ లోని ఇం డియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ (ఐఐఓఆర్) ప్రిన్సిపల్ సైంటిస్ట్ గా పనిచేస్తున్న డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ ప్రేమావతిపేట్ బస్తీలోని ప్రాథమిక పాఠశాల కు కార్పెట్లు అందజేశారు. తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని. అందుకే పేద విద్యార్థులు చదువుకునే పాఠశాల కు కార్పెట్లు అం దజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మునీరా బేగం తో పాటు ఉ పాధ్యాయురాలు డి సరిత, స్థానిక నాయకులు గోల్కొండ రాజ్ కుమార్, ఎడ్లకాడి సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 25లోగా ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇవ్వాలి

### రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్, జూలై 2 (నమస్తే ఉదయం):**



రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ఓటరు గా నమోదైన ప్రతి ఒక్కరు ఈ నెల 25వ తేదీ లోగా బూత్ లెవల్ ఆఫీసర్ ల నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుని పూర్తి వివరాలతో దాన్ని పూర్తి చేసి, ఫోటో తో పాటు తిరిగి ఇవ్వాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్షన్ రిజిస్ట్రేషన్ అథారిటీ (ఈఆర్ఓ) సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ను కలసిన విలేకరులతో మాట్లాడుతూ, ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇవ్వడంలో ఎవరు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో 6,35, 283 మంది ఓటర్లు, 547 పోలిం గ్ బూత్ లు ఉన్నాయన్నారు. వీటిలో 547 మంది బూత్ లెవల్ ఆఫీసర్లు, 55 మంది సూపర్వైజర్లను ఏర్పాటు చేసి ఇంటింటికి వెళ్లి ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఇం టికి రాని వారు సమీప పోలింగ్ బూత్ ల వద్ద ఉండే బీఎల్ ఓ లను సంప్రదించి ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకోవాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2,87,172 మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను ఇవ్వడం జరిగిందన్నారు. ఇది నగరంలోని మిగతా నియోజకవర్గాలతో పోలిస్తే ఎక్కువే అని గుర్తు చేశారు. 2002లో ఓటు వేసి ఉ న్నట్లయితే ఎక్కడ ఓటు వేశారు.. ఓటరు కార్డు నెం బరు ఎంత అనే వివరాలను రాయాల్సి ఉంటుందన్నారు. పూర్తి సమాచారం తో పాటు ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటో ను పెట్టి ఇవ్వాలన్నారు. ఈ నెల 31న ఓటరు జాబితా కు సంబందించిన డ్రాఫ్ట్ తయారౌతుందన్నారు.



**అనారోగ్యంతో బాధపడుతు నగరంలోని సోమాజిగూడ లోని ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న రాజ్యసభ మాజీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి హనుమంతురావు ను కలసి పరమార్శిస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్, పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ జల్ పల్లి నరేందర్ లు**

**- బుద్వేల్, నమస్తే ఉదయం**

## ఉప్పర్‌పల్లి బార్బీక్యూనేషన్‌లో హెచ్-ఫాస్ట్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు





ఉప్పర్ పల్లి లోని బార్బీక్యూ నేషన్





ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన నాలుగైదు రోజుల క్రితం మటన్, చేపలు






వివరాలు వెల్లడిస్తున్న అత్తాపూర్ ఫుడ్ ఇన్స్ పెక్టర్ సౌమ్య రెడ్డి

**బుద్వేల్, జూలై 2 (నమస్తే ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 179 వద్ద ఉ న్న బార్బీక్యూ నేషన్ లో గురువారం హైదరాబాద్ ఫుడ్ అడల్టేషన్ సర్వైలెన్స్ (హెచ్ - ఫాస్ట్) టీమ్ తో పాటు అత్తాపూర్ ఫుడ్ ఇన్స్ పెక్టర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. హెచ్ ఫాస్ట్ టీమ్ కు ఇద్దరు యువకులు ఫోన్ చేసి ఉప్పర్ పల్లి బార్బీక్యూ నేషన్ లో మాంసాహారం తిన్న మాకు అస్వస్థత కలిగిందని, దానిపై చర్యలు తీసుకోవాలని ఫోన్ రావడంతో హెచ్ - ఫాస్ట్ టీమ్ సభ్యులు దాడులు చేశారు. అత్తాపూర్ సర్కిల్ ఫుడ్ ఇన్స్ పెక్టర్ సౌమ్యరెడ్డి ఈ దాడులలో పాల్గొన్నారు. ఐదు నుంచి ఆరు రోజుల క్రితం తీసుకువచ్చిన మాంసం కు గురువారం రోజు డేట్ వేసిన లేబుల్ లు అతికించి పెట్టారని సౌమ్య రెడ్డి తెలి పారు. సరైన పద్ధతి లో ఫ్రీజింగ్ కూడా చేయలేదన్నారు. మాంసాహార పదార్థాలన్ని ఐదారు రోజుల క్రితం తీసుకువచ్చినవే అని గుర్తించడం జరిగిందన్నారు. వాటి శాంపిల్స్ ను సేకరించి ల్యాబ్ కు పంపించడం జరుగుతుందన్నారు. అన్ ఐజినిక్ ఫుడ్ ను పెట్టినందుకు రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి జరిమాన విధించడానికి కృషి చేస్తామన్నారు.

**మిగతా హోటళ్లలోను తనిఖీలు చేయాలి : ప్రజలు**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో కొత్త కొత్త హోటళు ,, రెస్టారెంట్లు వచ్చాయని, వాటన్నింటిపై తరచు తనిఖీలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు నూతనంగా ప్రభుత్వం నియమించిన హెచ్ ఫాస్ట్ సిబ్బంది దాడులు చేసి అహార పదార్థాలు నాణ్యతగా ఉ న్నాయా.. లేదా అని చూడాల్సిన అవసరం ఉందన్నారు.

# ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వ భావాలను పెంపొందిస్తాయి

**దేవాలయాలు సమాజంలో ఐక్యత, భక్తి భావం సాంస్కృతిక విలువలను పెంపొందించే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయి**

**తెలంగాణ రాష్ట్ర పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్**

**కూకట్ పల్లి, జూలై 2 (నమస్తే ఉదయం)**



బోరబండలో శివాజి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కినాపురం లక్ష్మణ్ గౌడ్ ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ నూతన దేవాలయ యంత్ర విగ్రహ సింహ వాహన శిఖర ప్రతిష్ఠ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ సభ్యులు,టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిధులుగా హాజరై స్థానిక నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, వేద పండితులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ ని డా. సత్యం శ్రీరంగం ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నల్లపోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి శాంతి, సత్సంకల్పాలు కలిగిస్తాయని, ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి దీవెనలు, కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సమృద్ధి వర్షాలతో పాడిపంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగింది. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. హైదరాబాద్ లో నెల రోజుల పాటు జరిగే ఆషాఢ బోనాల ఉత్సవాలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. భక్తిశ్రద్ధలతో ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించి, వారి సేవా భావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ ల అధ్యక్షులు మొయినుద్దీన్, కృష్ణ రాజ్ పుత్, విఠల్ రెడ్డి, నరసింహా యాదవ్, కనకయ్య, లక్ష్మీనారాయణ, సుంకన్న, మస్తాన్ రెడ్డి, భారతమ్మ, కలికోట శంకర్, రాజేష్ గౌడ్, పల్లపు వేణు, చోట మొయిజ్, అహ్మద్ వాజీద్ పాషా, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఈనెల10న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 2 (నమస్తే ఉదయం)**

విద్యారంగంలో సుదీర్ఘకాలంగా పేరుకుపోయిన వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10వ తేదీన (జులై 10) రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల బంద్ను నిర్వహించనున్నట్లు పీడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు హలీంపాష పిలుపునిచ్చారు. గురువారం గద్వాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. అదే సమయంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు గాయత్రి, పుష్ప, మౌనిక, దీపిక, అరుణ, జ్యోతి, శిరీష, కృష్ణవేణి, మాధవి, శ్రేయ తదితరులు పాల్గొన్నారు.



## జలమండలిలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఘనంగా సన్మానం

**జలమండలిలో 67 మంది ఉద్యోగులు పదవీ విరమణ**

**హైదరాబాద్, జూలై 2 (నమస్తే ఉదయం)**

జలమండలిలో పనిచేస్తున్న 67 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. పదవి విరమణ చేసిన ఉద్యోగులను గురువారం ఖైరతాబాద్ లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం సురేష్, జీఎం సరస్వతి పాటు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు



## గద్వాల్ జిల్లా విద్యారంగాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**డీఈఓ విజయలక్ష్మికి విద్యార్థి సంఘాల విజ్ఞప్తి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 2(నమస్తే ఉదయం)**

గద్వాల్ జిల్లా నూతన పూర్తి స్థాయి జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి విద్యార్థి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఖూఫీ× రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్‌పల్లి రంగస్వామి మాట్లాడుతూ... చాలా కాలం పాటు గద్వాల్ జిల్లాలో ఇన్‌చార్జ్ అధికారుల ఆధ్వర్యంలో విద్యాశాఖ పరిపాలన కొనసాగిందని, ప్రస్తుతం పూర్తి స్థాయి డీఈఓ నియామకం జరగడం జిల్లా విద్యారంగానికి ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, జిల్లాలో విద్యా వ్యవస్థ సమగ్ర అభివృద్ధికి ఒక ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని వారు డీఈఓను కోరారు. గద్వాల్ జిల్లా విద్యారంగం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా సమర్థవంతమైన పరిపాలన అందించాలని ఆకాంక్షిస్తూ, జిల్లాలో విద్యాభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘాలు ఎల్లప్పుడూ తమ వంతు నిర్మాణాత్మక సహకారాన్ని అందిస్తాయని నాయకులు స్పష్టం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఖూఫీ× రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్‌పల్లి రంగస్వామితో పాటు గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ సెక్రెటరీ భారత్, పాలమూరు యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ (ఖాఫీ×) ప్రెసిడెంట్ బత్తిని రాము, ఎండీ ఘఫూర్, కిరణ్, యువరాజు, సాంబ మరియు ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



## వడ్డెర కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు జూలై 2 ( నమస్తే ఉదయం):**

ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ వడ్డెర కాలనీలో నెలకొన్న సమస్యలను అతి త్వరలో పరిష్కరించడం జరుగుతుందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. బుధవారం ఉదయం స్థానిక మున్సిపల్ చైర్మన్ సుమలత, కమిషనర్ వెంకట కిషన్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్లతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీ ప్రజలతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, ఇంటి నంబర్ల అంశంలో ఇబ్బందులు ఎదుర్కొంటామని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ తరఫున ప్రత్యేక నిధులు కేటాయించి అతి త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కాలనీలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కాలనీలో నూతనంగా నిర్మించిన మునీశ్వర ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆరవ వార్డు పరిధిలోని ఎస్వి హోమ్స్ కాలనీలో మిషన్ భగీరథ పైప్లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కౌన్సిలర్ పాండు, నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులు, వెంకటేష్, కిషోర్ రెడ్డి, రాహుల్ రెడ్డి, గద్దె రాజు, నవీన్ రెడ్డి, లత, కో ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, బాబా, బండ రాజు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## రోడ్లపై వ్యాపారాలు వద్దు - మార్కెట్ సముదాయాన్నే వినియోగించుకోవాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 2 (నమస్తే ఉదయం)**

గద్వాల పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గురువారం పట్టణంలోని పాతబస్టాండ్, పాత కూరగాయల మార్కెట్ , తదితర ప్రాంతాలలో రోడ్లపై వ్యాపారాలు నిర్వహించే స్ట్రీట్ వెండర్లు, కూరగాయలు , పండ్ల వ్యాపారులకు గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్, మున్సిపల్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ , కమిషనర్ ప్రతి వ్యాపారిని వ్యక్తిగతంగా కలిసి మాట్లాడారు. రోడ్లపై వ్యాపారాలు నిర్వహించడం వల్ల తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజిటబుల్ మార్కెట్‌లో అన్ని రకాల వసతులతో కూడిన దుకాణాలు అందుబాటులో ఉన్నాయని, వ్యాపారులందరూ వాటిని వినియోగించుకొని అక్కడే విక్రయాలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. వ్యాపార దుకాణాలను సందర్శించి, కేవలం 120 మైక్రాన్లు లేదా అంతకంటే ఎక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ బ్యాగులను మాత్రమే విక్రయించాలని నిబంధనలను స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

**అక్రమ షాపుల తొలగింపునకు ఆదేశాలు**

గద్వాల పట్టణంలోని రథశాల ముందు రోడ్డును ఆక్రమించి, అక్రమంగా షాపులు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనివల్ల ప్రజలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నందున, సదరు అక్రమ షాపులను తక్షణమే తొలగించుకోవాలని వ్యాపారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



## ఎస్ఐఆర్ పత్రాలు పంపిణి విషయంలో నిర్లక్ష్యం వీడాలి

**అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్ పల్లి, జూలై 2 (నమస్తే ఉదయం)**

ఎస్ ఐ ఆర్ సర్వే సందర్భంగా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఓటర్లకు సహాయ సహకారాలు అందించి వారి ఓట్లు రద్దు కాకుండా చూడాలని కూకట్ పల్లి శాసన సభ్యుడు మాధవరం కృష్ణారావు సూచించారు. ఎస్ ఐ ఆర్ లో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గంలో ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బి ఎల్ వో లు ఎవరు మా వద్దకు రాలేదు అని స్థానిక ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావు జడ్.సి. కి ఫోన్ చేసి ఎస్ ఐ ఆర్ పత్రాలు పంపిణి విషయంలో నిర్లక్ష్యం వీడాలని ఆదేశించారు. బి ఎల్ వో ల తో పాటు స్థానిక బి ఎల్ ఏ లు తో కూడా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని అర్హులైన ఓటర్లకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఒక్క ఓటు కూడా తొలగించడానికి వీల్లేదని, ఏవైనా ఇబ్బందులు సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం తో పాటు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమలో బి.ఆర్.ఎస్.పార్టీ మెంబర్ షిప్ ఇంచార్జి గజ్జల నగేష్, మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విమర్శలకు సమాధానం చెప్పలేక హరీశ్‌రావు అక్రమ అరెస్ట్

**చర్చలకు పిలిచి తోక ముడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**హరీశ్‌రావు అరెస్ట్ దురదృష్టకరం.. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి**

**రాజేంద్రనగర్,జులై02(నమస్తే ఉదయం)**



బీఆర్ఎస్ నాయకులకు సవాలు విసిరిన కాంగ్రెస్ మంత్రులు తోక ముడిచి పారిపోయారని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి ఆరోపించారు.చర్చలకు వెళుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు,మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి,రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోల కార్తిక్ రెడ్డి,లను అడ్డుకుని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా శీలం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ...బీఆర్ఎస్ దెబ్బకు పారిపోయిన జూపల్లి...జూలో పిల్లి లాగ మారాడని విమర్శించారు.చర్చలకు రాకుండా పారిపోయిన జూపల్లి పిరికితనం బయటపడిందని విమర్శించారు.హరీష్‌రావును,పార్టీ నాయకత్వానికి గాని సవాల్ విసిరేంత స్థాయి లేదని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డికి ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పే ధైర్యం లేదని అన్నారు.చేతకాని మంత్రులు సవాల్ ఎందుకు చేయాలి.?ఎందుకు తోక ముడవాలని ప్రశ్నించారు.ప్రభుత్వం ఎదుర్కొంటున్న విమర్శలకు సమాధానం చెప్పలేక,పోలీసు బలగాలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని ప్రయత్నించడం దుర్మార్గమని మెచ్చా నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.కేవలం పోలీసుల అండతో ప్రతిపక్షాలను భయపెట్టి, ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు ఫలించవని ఆయన తెలిపారు.ప్రజా క్షేత్రంలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలని,ఇలాంటి అణచివేత చర్యలు మానుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని శీలం తిరుపతిరెడ్డి హెచ్చరించారు

## నడిరోడ్డుపైనే మందుబాబుల సిట్టింగ్‌లు

**రాత్రి వేళల్లో పడకేసిన పోలీస్ పర్యవేక్షణ, ప్రజల తీవ్ర విమర్శలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 2 ( నమస్తే ఉదయం)**

గద్వాల జిల్లా కేంద్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని, రాత్రి వేళల్లో పోలీసుల నిఘా కరువైందని పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గద్వాల పట్టణంలోని కృష్ణవేణి చౌరస్తాలో గల కృష్ణవేణి విగ్రహం ముందు మందుబాబులు యథేచ్ఛగా నడిరోడ్డుపైనే కూర్చుని మద్యం సేవిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రోడ్డుపై వాహనాల రాకపోకలు సాగుతున్నప్పటికీ, ఏమాత్రం భయం లేకుండా బహిరంగంగా మద్యం సేవిస్తూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. ఇంతగా మద్యం సేవిస్తున్న పోలీసులు అటువైపు రాకపోవడం పోలీసుల పని తీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. రాత్రి వేళల్లో నిరంతరం జరిగే పోలీస్ పెట్రోలింగ్, బీట్ వ్యవస్థ ఇప్పుడు పూర్తిగా పడకేసిందని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.

**రాత్రి 10 దాటినా మూతపడని దుకాణాలు:**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటలకల్లా వాణిజ్య సముదాయాలు, దుకాణాలు మూసివేయాల్సి ఉన్నప్పటికీ, జిల్లా కేంద్రంలో మాత్రం అర్ధరాత్రి వరకు చాయ్ హోటల్స్, కూల్ డ్రింక్స్, పాన్ షాపులు తెరిచే ఉంటున్నాయి. ఈ దుకాణాల వద్దే మందుబాబులు గుంపులు గుంపులుగా చేరుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ వ్యాపారాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**మహిళలు, సామాన్యుల భయాందోళన:**

గతంలో రాత్రి వేళల్లో నిరంతరం జరిగే పోలీస్ పెట్రోలింగ్, బీట్ వ్యవస్థ ఇప్పుడు పూర్తిగా పడకేసిందని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. తాగిన మైకంలో మందుబాబులు రోడ్డుపై వెళ్లేవారిపై అరుస్తూ, అసభ్య పదజాలంతో రచ్చ చేస్తుండటంతో మహిళలు, సాధారణ ప్రజలు రాత్రి పూట అటువైపు వెళ్లాలంటేనే వణికిపోతున్నారు.

**ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి:**

స్థానిక పోలీసుల ఉదాసీనత వల్లే పట్టణంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు (ఙా) వెంటనే స్పందించి, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని, నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 10 దాటిన తర్వాత కూడా తెరిచే ఉంచే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బహిరంగ మద్యపానానికి అడ్డుకట్ట వేయాలని పట్టణ ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.